క్లుప్తంగా

2కే రన్‌లో యశోదాకృష్ణకు ప్రథమం


ఆటల పోటీల్లో పాల్గొన్న గణపవరం హైస్కూల్ విద్యార్థులు

గణపవరం: నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా తణుకు చిట్టూరి ఇంద్రయ్య కళాశాలలో నిర్వహించిన అండ్–17, అండర్–14 2కే రన్ పోటీల్లో గణపవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు యశోదాకృష్ణ ప్రథమ, పి.సురేష్ ద్వితీయ స్థానం సాధించినట్టు బాలుర హైస్కూలు హెచ్‌ఎం మూర్తి తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు పాల్గొని, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు సాధించారని వివరించారు. విద్యార్థులను ప్రోత్సహించిన పీడీని ఆయన అభినందించారు.

వెల్లమిల్లిలో అవినీతి ఆరోపణపై విచారణ


వెల్లమిల్లిలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ చంద్రశేఖర్

ఉంగుటూరు: వెల్లమిల్లి పంచాయతీలో అవినీతి జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదుపై డీఎల్‌పీఓ చంద్రశేఖర్ గురువారం వెల్లమిల్లి పంచాయతీకి విచారణకు వచ్చారు. పంచాయతీ కార్యదర్శి బాలాజీ హాజరుకాలేదు. అవినీతిపై తనకు తెలియదని సర్పంచ్ కుమార్‌రాజ తెలిపారు. గ్రామస్తులతో డీఎల్‌పీఓ మాట్లాడారు. నిబంధనల ప్రకారం ముందుకు వెళతామని డీఎల్‌పీఓ తెలిపారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం


ఉంగుటూరు పంచాయతీ ఆఫీసు వద్ద మొక్కలను నిల్వచేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: వన మహోత్సవానికి ఉంగుటూరులో మొక్కలను సిద్ధం చేశారు. ఉంగుటూరు అటవీ ప్రాంతం నుంచి మొక్కలను ఉంగుటూరు పంచాయతీ కార్యాలయానిక ట్రాక్టర్లపై తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటాలనే సంకల్పంతో వనమహోత్సవం నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి గరి, సర్పంచ్ బండారు సింధు తెలిపారు.

ఉప్పాకపాడులో శ్రీకృష్ణుని ఊరేగింపు


ఉప్పాకపాడులో శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉప్పాకపాడు గ్రామంలో శ్రీకృష్ణుని ఊరేగింపు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక తాడేపల్లిగూడెం కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 26న మాకా నాగేశ్వరరావు ఇంటివద్ద ఏర్పాటుచేసిన వేదికపై శ్రీకృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భగవద్గీత శ్లోక పారాయణం చేశారు. శ్రీకృష్ణుని ఊరేగింపులో కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎం కోటేశ్వరరావు, సీహెచ్ అశోక్, రామారావు, హనుమంతరావు, జయలక్ష్మి, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెదవేగి గురుకులానికి అవార్డు


అవార్డుతో గురుకుల యాజమాన్యాన్ని సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన పెదవేగి గురుకుల పాఠశాల 2023–24 విద్యాసంవత్సరానికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు సాధించింది. రాష్ట్రంలోని 192 సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా స్థాయి విభాగాల్లో పెదవేగి గురుకులం ప్రథమ స్థానంలో నిలిచింది. గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీఓ ఎన్ భారతి పాఠశాల ప్రధానాచార్యులు మాడా వెంకటేశ్వరరావు, సిబ్బంది పీడీ కె.జయరాజు, పీఈటీ పి.గురుమూర్తి, విద్యార్థులను అభినందించారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెదపాడు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తేజ రతన్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులంతా పాల్గొనాలని పేర్కొన్నారు.

గిడుగు, ధ్యాన్ చంద్ సేవలు చిరస్మరణీయం


దెందులూరు : నర్సింగ్ కళాశాలలో తెలుగు అక్షరాల ప్రదర్శన


భీమడోలు : శాఖా గ్రంథాలయంలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

- ఘనంగా జయంతి కార్యక్రమాలు
- విద్యార్థులకు వివిధ పోటీల నిర్వహణ
- బహుమతుల ప్రదానం

భీమడోలు: వ్యావహారిక భాషోద్యమ ఆద్యుడు, బహుభాషా శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త, తెలుగు కవి గిడుగు వెంకట రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం సాయంత్రం గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి జయంతిని, అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు, ధ్యాన్ చంద్ సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో పెద్దలు సూర్యనారాయణ, పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

● అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో హెచ్‌ఎం షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులంతా అ ఆకారంలో కూర్చుని తెలుగు భాషా కమ్మదనాన్ని చాటారు. అనంతరం గ్రామంలో క్రీడా జెండాలతో ర్యాలీ నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కైకరం హైస్కూల్లో..

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ సలగాల గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగసుధ, పాపాయమ్మ, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు గవరయ్య ఆధ్వర్యంలో 3కె రన్ నిర్వహించారు. క్రీడా దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ధ్యానచంద్, గిడుగు వెంకట రామమూర్తి జీవిత విశేషాలను వివరించారు. తెలుగు ఉపాధ్యాయులు రాజకుమారి, రవి కుమార్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగు పందెం, వాలీబాల్, లాంగ్ జంప్, తెలుగు భాష ప్రాముఖ్యత, రామమూర్తి గూర్చి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కోనా అప్పారావు, రామారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషా పిడుగు గిడుగు

గణపవరం: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు చిరస్మరణీయుడని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్మలకుమారి అన్నారు. గురువారం డిగ్రీ కాలేజీలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గిడుగు రామ్మూర్తి జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యాసరచన, కథ, కవిత, లేఖ రచనల పోటీలు నిర్వహించిన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు చైతన్య, అక్కిరాజు, స్వరూపరాణి, వెంకన్నబాబు, తెలుగు విభాగాధిపతి జి.వెంకటరమణ, పీడీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: మండలంలోని విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషను ప్రతిబింబించేలా అక్షరాలతో స్థానిక నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శన చేశారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలుగు ఉపాధ్యాయులు పల్లాలమ్మ, చంద్రలేఖ, ఉమామహేశ్వరి వివరించారు. మేజర్ ధ్యాన్ చంద్ గొప్పతనాన్ని పీడీలు జక్కుల సురేష్ కుమార్, ఎం కృష్ణారావు, డాక్టర్ మనోహర్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు వివరించారు. ప్రధానోపాధ్యాయులు శర్మ, రామాంజనేయులు, బాషాల ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. దెందులూరు నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలుగు తల్లిని ప్రతిబింబించేలా వేషధారణ, తెలుగు అక్షరాలతో విద్యార్థినులతో ప్రదర్శన నిర్వహించారు.

గురుకుల పాఠశాలలో..

పెదపాడు : తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు సేవలను వట్లూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి కొనియాడారు. వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.


గణపవరం : విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మల కుమారి


దెందులూరు : పోతునూరు పాఠశాలలో ఆటల పోటీలు


ఉంగుటూరు: కైకరం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవం

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

దెందులూరు: త్వరలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం వచ్చే నెల 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లు, లెక్చరర్లు, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే టీచర్లు ఫారం–19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో మూడు సంవత్సరాలు నివాసితులై ఉండాలని, ఏ సంస్థలో పనిచేస్తున్నారో ధ్రువీకరణ పత్రం దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తహసీల్దార్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. 15వ తరువాత స్క్రూటినీ, నవంబర్ 6న ఫైనల్ పబ్లికేషన్ ఉంటుందని తహశీల్దార్ వివరించారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు


పోలసానిపల్లి నెం.1 స్కూల్లో ప్లేట్లు పంపిణీ చేసిన సర్పంచ్ రహీమాభేగం

భీమడోలు: ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. పోలసానిపల్లి నెం.1 ప్రాథమిక పాఠశాలలో టీచర్ చిన్నం బేబి దైవ కటాక్షి పదవీ విరమణ నేపథ్యంలో ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమం హెచ్‌ఎం కె.తులసి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఈఓ శ్రీనివాసరావు, సర్పంచ్ షేక్ రహీమాభేగం హాజరయ్యారు. టీచర్ కటాక్షి, రవిప్రకాష్ దంపతులను ఘనంగా సత్కరించారు. కటాక్షి ఆర్థిక సాయంతో విద్యార్థులకు షుభదిన్ భోజనాలు పెట్టించారు. మధ్యాహ్న భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జె.జయరామకృష్ణ, పెద్దలు షేక్ హసేనా, హెచ్‌ఎం బాలభాస్కర్, జె.వసంత, టీచర్లు ఎం శరీన్, మండే సుధాకర్, ఎస్ జయశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీ రాణికుమారి, సీఆర్‌పీ సత్యప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలను రాజకీయాలకతీతంగా ఏర్పాటు చేయాలి

రైతులు, కౌలు రైతుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

ఉంగుటూరు: సాగునీటి సంఘాల ఎన్నికలు రాజకీయాలకతీతంగా నిర్వహించాలని రైతులు, కౌలు రైతులు డిమాండ్ చేశారు. ఉంగుటూరు మండలం బొమ్మిడిలో గురువారం సహకార సొసైటీ సమీపంలో నిర్వహించిన సమావేశంలో రైతుల తమ అభిప్రాయాలను వెల్లడించారు. గోదావరి, కృష్ణా డెల్టాల కాలువల ఆధునీకీకరణకు నిధులు కేటాయించి, పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా పరిధిలో కృష్ణా, గోదావరి డెల్టాల ఆయకట్టు భూములు శివారు ప్రాంతం కావడంతో సక్రమంగా సాగునీరు అందడం లేదని తెలిపారు. ముంపునకు ముందు, సాగునీరు అందడానికి వెనుక అన్న విధంగా ఉండడంతో అన్నదాతలు నష్టపోతున్నారని వివరించారు. కౌలు రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కౌలు రైతులందరికీ పంట సాగుదారు హక్కు పత్రాలు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్‌లో వాస్తవ సాగుదారుల పేర్లను నమోదు చేయాలని కోరారు. టార్పాలిన్లు, స్ప్రేయర్లు వంటి చిన్న వ్యవసాయ యాంత్ర పరికరాలను కౌలు రైతులకు, పేద రైతులకు 50శాతం సబ్సిడీపై అందించాలని కోరారు. గోదావరి, కృష్ణా డెల్టాల పరిధిలో కాలువలపై తూములను ఆధునీకీకరించాలన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గుండుగొలను డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడారు.

దాతల సహకారంతో కల్యాణ మండప నిర్మాణం


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దెందులూరు: ఉండ్రాజవరంలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధికి దాతలు, గ్రామస్తులు సహకారం అందించడం అభినందనీయమని ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జరజాపు రంగారావు, లయన్స్ క్లబ్ డైరెక్టర్ చుక్కా అవినాష్ రాజు, ఏలూరు లయన్స్ క్లబ్ సహాయకులు బీవీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం గ్రామస్తుల సౌకర్యార్థం అదే గ్రామానికి చెందిన మద్దుల అప్పలస్వామి, కనకమ్మ కుమారుడు వెంకట్రావు, అశోక్ కుమార్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వెంకట రమణమ్మ, అనురాధలు రూ.5.50 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని మద్దుల చినసూర్యనారాయణ, చిన తిరుపతమ్మ, జరజాపు శ్రీనివాసరావు, అనకాపల్లి నర్సింహరావు, లయన్స్ క్లబ్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులను సత్కరించారు. లయన్స్ క్లబ్ నాయకులు రంగారావు, హరీష్, ఎంపీటీసీ సున్నా నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రమాదాలను అరికట్టాలి


ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలను అరికట్టాలని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇఫ్టూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం సాయంత్రం ఏలూరు వన్‌టౌన్ ఏరియా ఇఫ్టూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కల్పన థియేటర్ వద్ద నుంచి చందన మెయిన్ రోడ్డు పాత బస్టాండ్ వరకు ప్రదర్శనగా వచ్చి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. ధర్నా చేశారు. వెంకట్రావు, శ్రీనివాసరావులు మాట్లాడుతూ పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలకు సెజ్ చట్టాన్ని ప్రవేశ పెట్టడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవటం, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ప్రభావమే కారణమని ఆరోపించారు. అచ్చుతాపురం బేస్ సెజ్ ప్రాంతంలో 250 పరిశ్రమలు ఉన్నాయని, అందులో 220 పరిశ్రమలు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నట్లు ఎంక్వైరీ రిపోర్టులో తేలిందని స్వయంగా హోంమంత్రి అనిత విలేకరుల వద్ద వెల్లడించారని గుర్తు చేశారు. బీఎన్‌ఎస్ సెక్షన్ 105 ప్రకారం కేసులు నమోదు చేసి యజమానులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ బ్లాస్టింగ్‌లో మరణించిన కుటుంబాలకు యజమానిచే రూ.కోటి పరిహారంతో పాటు, ప్రభుత్వం కూడా రూ.కోటి చెల్లించాలని కోరారు. పరిశ్రమల్లో తప్పనిసరిగా ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈఎస్ఐ ఆసుపత్రులు, స్పెషల్ బర్న్ వార్డులు ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పల్లి గంగరాజు, ఘంటసాల రాంబాబు, జగ్గారపు రమణ, రంగాల నూకరాజు, బి.వీరభద్రం, గుంజ వెంకటేశ్వరరావు, నవుడు నీరు బాబు, కె.త్రినాథ్, మీసాల రమణ, కె.నాని తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్ నగర్ ప్రాంతంలో ఒక అపార్టుమెంట్‌లో గ్యాస్ సిలిండర్ పైపు ఊడిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఆస్తి నష్టం సంభవించగా మహిళకు ప్రాణాపాయం తప్పింది. అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అశోక్ నగర్లోని ఒక అపార్టుమెంటు మొదటి అంతస్తు ఫ్లాట్‌లో గురువారం రాత్రి మహిళ వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ నుంచి పొయ్యికి వెళ్లే ట్యూబు ఓ వైపు ఊడిపోయి మంటలు వ్యాపించాయి. మహిళ అక్కడ నుంచి తప్పుకోవటంతో ప్రమాదం తప్పింది. వంట గది అంతా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు. వంట గదిలో కప్‌బోర్డులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.2 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని తోటగూడెం గ్రామం వైపు నుంచి పెదపాడుకు కోళ్ల వ్యర్థాలను వాహనంలో తరలిస్తుండగా సీజ్ చేసినట్టు ఎస్సై శుభోశఖర్ తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

దెందులూరు: గాలాయగూడెం శ్రీ అచ్చమ్మతల్లి ఆలయ ఆవరణలో అర్చకులు ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ పేర్కొంది. ఉదయం 9 గంటల నుంచి సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.. దెందులూరు మండలం కొవ్వలికి చెందిన మేరుగ జాన్ (42) ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో అటెండర్‌గా పని చేస్తుంటాడు. ఆతను ఈనెల 24న దెందులూరులో బంధువుల శుభకార్యానికి హాజరై మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా జాతీయ రహదారి నుంచి ఆశ్రం ఆసుపత్రి వైపు వెళ్లే సర్వీసు రోడ్డులోకి వాహనం మళ్లిస్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో జాన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి స్థానికులు అతన్ని సమీపంలోని ఆశ్రం ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరం

ఏలూరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని ఏలూరు 2 టౌన్ సీఐ రమణ అన్నారు. గురువారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 10 మందిని అదుపులోకి తీసుకుని టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. వారికి కౌన్సెలింగ్ ఇస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, దానివల్ల శరీరం అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. మద్యపానం వల్ల మానసిక స్థితి మన అదుపులో ఉండదని, ఇతరులకు ఇబ్బందికరంగా మారుతుందని వివరించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శనివారపు పేట సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారపు పేట, శ్రీరామ్ నగర్, విద్యా నగర్, శాతవాహన నగర్, దొండపాడు, న్యూ అశోక్ నగర్, దుగ్గిరాల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నిందితుడి ఇంటికి నిప్పు

భయంతో ఇంటి నుంచి పరారైన నిందితుడి తండ్రి


ఇంటిలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భీమడోలు: భీమడోలు పంచాయతీ పరిధిలోని ఆర్జావారిగూడెంలో జరిగిన దారుణ హత్యాకాండతో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బలగాలను మోహరించారు. రెండోరోజైన గురువారం కూడా ప్రత్యేక పోలీస్ టీములను కాపలా ఉంచారు. ఆ ప్రాంతంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఎక్కువ మంది సంచరించకుండా ఆంక్షలు విధించారు. ఆస్తి తగాదాల నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన దాడిలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దుర్మరణం చెందగా, వివాహిత తీవ్ర గాయాలతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామంలో కలకలాన్ని రేపింది. మృతుడు చేబత్తుల కృష్ణ శవపరీక్ష తర్వాత భీమడోలు రహదారిపై బుధవారం రాత్రి ధర్నా చేసిన విషయం అందరికి తెలిసిందే. అంతకు ముందుగానే కోపోద్రిక్తులైన బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు దాడికి పాల్పడిన వ్యక్తి ఇంటికి నిప్పంటించారు. ఇంటిలోని వస్తువులన్నింటిని తగులబెట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. హత్యకు పాల్పడిన తడపల వెంకటేశ్వరరావు తండ్రి ప్రాణభయంతో అప్పటికే ఇంటి నుంచి పంగిడిగూడెంకు పరారయ్యాడు. అయితే ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై వై.సుధాకర్ గురువారం రాత్రి తెలిపారు.

క్రీడా పోటీల్లో విజేతలకు పతకాలు


బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో విజయం సాధించిన కస్తూరిబా స్కూల్ జట్టు


బాస్కెట్‌బాల్ బాలుర విభాగంలో విజేత జట్టు


బ్యాడ్మింటన్, లెమెన్ స్పూన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ఏపీఎం ప్రభావతి


అథ్లెటిక్స్ అంశంలో పతకాలు సాధించిన సచివాలయ ఉద్యోగులు

ఏలూరు రూరల్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఏలూరులో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీలు ముగిశాయి. గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్ గోదావరి హాల్లో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ కె వెట్రిసెల్వి మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. బాస్కెట్‌బాల్ విభాగంలో ఏలూరు కస్తూరిబా బాలికల జట్టు, బాలుర విభాగంలో అల్లూరి సీతారామరాజు స్టేడియం జట్టు విజయం సాధించాయి. డ్వాక్రా సంఘాల పర్యవేక్షకురాలు ఏపీఎం ప్రభావతి బ్యాడ్మింటన్, లెమన్‌స్పూన్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారు. ఏలూరులో పలు సచివాలయాల ఉద్యోగులు అథ్లెటిక్స్ అంశాల్లో విజయం సాధించారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వివిధ వృత్తి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ (ఆంధ్రాబ్యాంక్) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో 30 రోజుల ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ఈ కోర్సులో చేరడానికి 5వ తరగతి, ఆ పై విద్యార్హత ఉండి, 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని, ఆసక్తి గల మహిళలు సెల్ నెంబర్లు 99485 65256, 95330 79471, 90140 40780లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశాల సమయంలో ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులు, మూడు పాస్‌పోర్టు ఫోటోలు అందజేయాలని పేర్కొన్నారు.